సాక్షి నిర్మల్

బుధవారం, 17, మే, 2023



నిర్మల్‌లో జీరో షాడో!

నిర్మల్‌లో మంగళవారం ఓ అద్భుతం ఆవిష్కృతమైంది. మధ్యాహ్నం 12:12 నుంచి 12:13 నిమిషాల 40 సెకన్లపాటు నీడ మాయమైంది. 8లో▸



'రేషన్' గోస తీరేదెన్నడు?

రేషన్ బియ్యం తెచ్చుకునేందుకు అడవి బిడ్డలు పాట్లు పడుతున్నారు. తమ ఊళ్లలో రేషన్ దుకాణాలు లేక కిలోమీటర్ల దూరం నడిచి సరుకులు తెచ్చుకుంటున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 41.8/29.5

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా అధికంగా నమోదవుతాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. గాలిలో తేమ తగ్గడంతో వేడిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

భైంసాలో 'ది కేరళ స్టోరీ' ప్రదర్శన



సినిమా వీక్షిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, మహిళలు, యువతులు

భైంసాటౌన్:భైంసా పట్టణంలో ఎట్టకేలకు ది కేరళ స్టోరీ చిత్రం ప్రదర్శించారు. రెండురోజులుగా చిత్ర ప్రదర్శనకు పోలీసులు అనుమతించకపోవడంతో థియేటర్ నిర్వాహకులు ప్రదర్శన నిలిపేశారు. దీంతో బీజేపీ, హిందూవాహిని ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. దీంతో మంగళవారం ఉదయం, మధ్యాహ్నం ఆటలకు అనుమతి ఇవ్వడంతో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవితోపాటు పలువురు నాయకులు, హిందూసంఘాల నాయకులు, మహిళలు, యువతులు చిత్రం వీక్షించారు. ఈ సందర్భంగా థియేటర్ వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి



డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య శాఖ సిబ్బంది

భైంసాటౌన్:దోమల ద్వారా వ్యాపించే డెంగీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భైంసా డిప్యూటీ డీఎంహెచ్‌వో ఇద్రిజ్‌ఖోరి సూచించారు. జాతీయ డెంగీ నివారణ దినం సందర్భంగా భైంసాలోని కుంట ప్రాంతంలో ఆరోగ్యసిబ్బందితో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పడేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు, పూల కుండీల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యురాలు ఫిర్దోస్ జబీనా, ఆశ, ఏఎన్ఎం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రిని సన్మానించిన లెక్చరర్లు



మంత్రి ఐకేరెడ్డిని సన్మానిస్తున్న లెక్చరర్లు

నిర్మల్‌టౌన్: కాంట్రాక్టు లెక్చరర్స్‌ను ప్రభుత్వం ఇటీవల రెగ్యులర్ చేసింది. అందుకు కృతజ్ఞతగా జిల్లాలో రెగ్యులర్ అయిన కాంట్రాక్టు లెక్చరర్లు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అడవిని నరికితే కఠిన చర్యలు



టేకు చెట్లు నరికిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎఫ్‌డీపీటీ వినోద్‌కుమార్

పెంబి: అడవిని నరికితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎఫ్‌డీపీటీ వినోద్‌కుమార్ హెచ్చరించారు. తాటిగూడ సెక్షన్ పరిధిలో పది రోజుల క్రితం టేకు చెట్లను కొంతమంది నరికారు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చెట్లు నరికిన ప్రదేశాన్ని ఎఫ్‌డీపీటీ మంగళవారం పరిశీలించారు. అడవిలో చెట్లు నరికినా, వన్యప్రాణులను చంపినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్మగ్లర్లకు సహకరించే అటవీ అధికారులపై కూడా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, అవసరమైతే పోలీసుల సహకారం తీసుకోవాలని ఫారెస్ట్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో సునీల్ హెరామత్, ఎఫ్‌డీవో కోటేశ్వర్‌రావు, పెంబి ఎఫ్ఆర్‌వో రామకృష్ణ, సిరిచెల్మ ఎఫ్ఆర్‌వో గణేశ్, పెంబి రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.



కాకతీయ విశ్వవిద్యాలయం

ఇదేం పరీక్ష!?

- కోర్సు ఫీజుకన్నా పరీక్ష ఫీజే ఎక్కువ
- కాకతీయ వర్సిటీలో ఇష్టారాజ్యం
- ఆందోళన చెందుతున్న పేద, మధ్య తరగతి విద్యార్థులు
- పరీక్షలకు దూరమవుతున్న వైనం..



ఈ విద్యార్థి పేరు అఖిలేశ్. 2012లో లక్ష్మణచాందలోని ఎస్వీజీ డిగ్రీ కళాశాలలో ప్రవేశం పొందాడు. అయితే అప్పట్లో పాస్ కాలేకపోయాడు. తర్వాత సెమిస్టర్ విధానం రావడంతో నాన్ సెమిస్టర్ చదివిన(2012–15) అఖిలేశ్‌కు పరీక్షలు రాసే అవకాశం లేకుండాపోయింది. ఇటీవల కాకతీయ విశ్వవిద్యాలయం నాన్ సెమిస్టర్ విద్యార్థులకు పరీక్షలు రాసే అవకాశం కల్పించింది. దీంతో అఖిలేశ్ ఆనందపడ్డాడు. ఫీజు కడదామని యూనివర్సిటీకి వెళ్లాడు. పరీక్ష రాయడం కోసం విశ్వవిద్యాలయం నుంచి అనుమతి కోసం ప్రతీ ఏడాదికి రూ.3 వేలు, తప్పిన ఒక్కో సబ్జెక్టుకు రూ.4 వేలు చెల్లించాలని అధికారులు చెప్పడంతో కంగుతిన్నాడు. తాను తప్పిన సబ్జెక్టులు, యూనివర్సిటీ అనుమతి ఫీజు కలిపి లెక్కిస్తే రూ.23 వేలు చెల్లించాలని చెప్పడంతో మూడేళ్ల డిగ్రీ కోర్సు ఫీజు కూడా అంతలేదని, పరీక్ష ఫీజు అంత ఎలా కట్టాలని అంటున్నాడు. జిల్లా వ్యాప్తంగా సుమారు 1,500 మందిదీ ఇదే పరిస్థితి.

అప్పు చేయాల్సిన పరిస్థితి..



మాది మధ్యతరగతి కుటుంబం. 2012లో డిగ్రీలో చేరాను. అప్పుడు నాన్ సెమిస్టర్ విధానం ఉంది. అనివార్య కారణాలతో డిగ్రీ పాస్ కాలేకపోయాను. తర్వాత సెమిస్టర్ విధానం రావడంతో తమకు పరీక్షలు రాసే అవకాశం ఇవ్వలేదు. ఇటీవల కాకతీయ విశ్వవిద్యాలయం అవకాశం ఇవ్వడంతో సంతోషపడ్డా. డిగ్రీ పూర్తి చేయాలని ఫీజు కట్టేందుకు యూనివర్సిటీకి వెళ్లాను. కానీ, ఫీజుల విషయం తెలిసి ఆశ్చర్యపోయాను. పరీక్ష ఫీజు కట్టడానికి అప్పు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. – రాజేందర్, విద్యార్థి

లక్ష్మణచాంద:నాన్ సెమిస్టర్‌తోపాటు, సెమిస్టర్ విద్యార్థులు కాకతీయ విశ్వవిద్యాలయం పెట్టిన పరీక్ష ఫీజులు చూసి అవాక్కవుతున్నారు. సెమిస్టర్ విధానం లేక ముందు ఏడాదికి ఒకసారి మాత్రమే పరీక్షలు నిర్వహించేవారు. అప్పుడు పరీక్ష ఫీజు కూడా వందల్లోనే ఉండేది. 2016లో సెమిస్టర్ విధానం ప్రవేశపెట్టారు. దీంతో ఏడాదికి రెండుసార్లు పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో పరీక్ష ఫీజులు కూడా రెండుసార్లు చెల్లించాల్సి వస్తోంది. మరోవైపు యూనివర్సిటీ అధికారులు పరీక్ష ఫీజులను భారీగా పెంచేశారు. ఇక ఫెయిల్ అయితే ఒక్కో సబ్జెక్టుకే వేల రూపాయల ఫీజు వసూలు చేస్తున్నారు. దీంతో పేద, మధ్య తరగతికి చెందిన డిగ్రీ విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

టైం ఫ్రేమ్ విధానంతో..

యూజీసీ నిబంధనల ప్రకారం ఒక విద్యార్థి డిగ్రీలో ప్రవేశం పొందిన తరువాత నిర్దిష్ట కాలం 5(3+2) ఏళ్లలో కోర్సు పూర్తిచేయాలి. గడువులోగా డిగ్రీ పూర్తిచేయని వారిని టైం ఫ్రేమ్ కింద పరిగణిస్తారు. అయితే ఈ విధానం పీజీలో ముందు నుంచే ఉంది. కోవిడ్ కారణంగా మూడేళ్లు అమలు చేయలేదు. కాకతీయ యూనివర్సిటీ డిగ్రీలోనూ టైం ఫ్రేమ్ విధానం ప్రవేశపెట్టింది. 2015–16 లేదా అంతకంటే ముందు డిగ్రీలో ప్రవేశం పొందిన వారికి ఇది వర్తిస్తుంది. నాడు కోర్సు పూర్తిచేయని విద్యార్థులు ప్రస్తుతం పరీక్షలు రాయాలంటే ముందుగా రిజిస్టర్ పేరిట ప్రాసెసింగ్ ఫీజు ప్రతీ సంవత్సరానికి రూ.3 వేల చొప్పున చెల్లించాలి. ఇక ఫెయిల్ అయిన ప్రతీ సబ్జెక్టుకు రూ.4 వేలు చెల్లించాలి. ఉదాహరణకు ఒక విద్యార్థి మూడేళ్లలో ఒక్కో సబ్జెక్టు ఫెయిల్ అయితే మూడేళ్ల ప్రాసెసింగ్ ఫీజు రూ.9 వేలు, ఒక్కో సబ్జెక్టుకు రూ.4 వేల చొప్పున రూ.12 వేలు చెల్లించాలి. డిగ్రీ కోర్సు ఫీజు 2015–16లో ఏడాదికి రూ.10 వేలు ఉండగా, ప్రస్తుతం పరీక్ష ఫీజు అంతకు రెట్టింపు అవుతోంది. దీంతో బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు ఉన్న విద్యార్థులు పరీక్ష రాయడానికి జంకుతున్నారు.

జిల్లాలో సుమారు 1,500 మంది..

నాన్ సెమిస్టర్, సెమిస్టర్ విధానంలో చదివి టైంఫ్రేమ్ కింద నేడు పరీక్ష రాసేందుకు జిల్లా వ్యాప్తంగా సుమారు 1,500 మంది వరకు ఉన్నారని సమాచారం. వీరిలో 80 శాతం మంది పేద, మధ్యతరగతి విద్యార్థులే. భారీ మొత్తంలో పరీక్ష ఫీజులు చెల్లించలేక డిగ్రీ పూర్తిచేయడానికి వెనుకాడుతున్నారు. యూజీసీ, కాకతీయ యూనివర్సిటీ అధికారులు స్పందించి పరీక్ష ఫీజులు తగ్గించాలని కోరుతున్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



ఆత్మీయ సమ్మేళనంలో అభివాదం చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్సీ విఠల్, బీఆర్ఎస్ నేతలు

- బీఆర్ఎస్ కార్యకర్తలకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పిలుపు
- నిర్మల్‌లో పార్టీ ఆత్మీయ సమ్మేళనం

నిర్మల్‌టౌన్: సంక్షేమ పథకాలతో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణలో బీఆర్ఎస్‌ను మూడోసారి అధికారంలోకి తీసుకురావడానికి ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని దివ్యగార్డెన్‌లో బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని 10 వార్డులకు సంబంధించిన ఆత్మీయ సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను మంత్రి ఆవిష్కరించారు. తర్వాత పది వార్డుల కౌన్సిలర్లు తమ వార్డుల్లో జరిగిన అభివృద్ధిని వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ నిర్మల్ విద్య, వైద్యరంగాల్లో గణనీయమైన ప్రగతి సాధించిందని పేర్కొన్నారు. దేవాదాయ శాఖ మంత్రిగా జిల్లాలోని అనేక ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. మిషన్ భగీరథ ద్వారా నిర్మల్ నియోజకవర్గంలో 213 గ్రామాలకు రూ.300 కోట్ల వ్యయంతో పరిశుద్ధమైన తాగునీరు ఇంటింటికీ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అన్ని కులాల, మతాల వారికి కమ్యూనిటీ హాళ్లు నిర్మించామన్నారు. త్వరలో ఖాళీ స్థలం ఉన్న వారు ఇల్లు కట్టుకునేందుకు రూ.3 లక్షలు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ ఒకేచోట అందేలా నిర్మల్‌లో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవనాన్ని రూ.56 కోట్లతో నిర్మించినట్లు తెలిపారు. సుమారు రూ.48.83 కోట్లతో 250 పడకల జిల్లా ఆస్పత్రి భవనం పనులు జరుగుతున్నాయన్నారు. రూ.166 కోట్ల వ్యయంతో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ భవనాలను సీఎం కేసీఆర్ త్వరలో ప్రారంభిస్తారని వెల్లడించారు. నిర్మల్‌లో ఐటీ పార్క్ నిర్మాణానికి కేటీఆర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం పరితపిస్తున్న కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లి బీఆర్ఎస్ గెలుపు కోసం పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. ప్రతీ గడపకూ తీసుకెళ్లాలని, ప్రజలతో పథకాలపై చర్చిస్తూ వారిలో చైతన్యం తీసుకురావాలని కోరారు.

బీజేపీకి గుణపాఠం చెప్పారు..

దేశంలో తమకు ఎదురు లేదని విర్రవీగుతున్న బీజేపీకి కర్ణాటక ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని మంత్రి పేర్కొన్నారు. కేంద్రంలో ఎనిమిదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రానికి ఎలాంటి నిధులు ఇవ్వలేదన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచిందని, రూ.400 ఉన్న వంటగ్యాస్ సిలిండర్ ధరను, రూ.1200లకు పెంచారని తెలిపారు.

మహేశ్వర్‌రెడ్డి ఓ ఐరన్ లెగ్

నిర్మల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఓ ఐరన్‌లెగ్ అని మంత్రి ఎద్దేవా చేశారు. ఆయన ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ ఓడిపోతుందని పేర్కొన్నారు. మొదట టీడీపీలో ఉండగా ఆ పార్టీ తెలంగాణలో లేకుండా పోయిందని తెలిపారు. తర్వాత ప్రజారాజ్యం కనుమరుగైందని తెలిపారు. కాంగ్రెస్‌లోచేరి దానిని ఖతం చేశారని చెప్పారు. బీజేపీకి కూడా అదేగతి పడుతుందని వెల్లడించారు.

కేసీఆర్‌కు రుణపడి ఉండాలి..

ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నారని తెలిపారు. అలాంటి కేసీఆర్‌కు ప్రజలంతా రుణపడి ఉండాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో ఇంద్రకరణ్‌రెడ్డిని మళ్లీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, బీఆర్ఎస్ నాయకులు అల్లోల గౌతమ్‌రెడ్డి, పాకాల రాంచందర్, అల్లోల మురళీధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మరుగొండ రాము, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణచారి, పది వార్డుల కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సిలిండర్ వద్ద బతుకమ్మ ఆడుతున్న కౌన్సిలర్లు

సిలిండర్‌కు దండలు వేసి నిరసన..

ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ పార్టీ మహిళా కౌన్సిలర్లు, నాయకులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఖాళీ సిలిండర్లతోపాటు, పెట్రోల్, డీజిల్ క్యాన్లకు పూలదండ వేసి దండం పెట్టారు. తర్వాత బతుకమ్మ ఆడారు. బీజేపీ అధికారంలోకి రాకముందు వంటగ్యాస్ ధర, ప్రస్తుత ధర ప్లకార్డును ప్రదర్శించారు.

అధిక ఫీజులను నియంత్రించాలి

- కలెక్టర్‌కు బీజేవైఎం వినతి

నిర్మల్‌చైన్‌గేట్:ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలని బీజేవైఎం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పుస్తకాలు, యూనిఫామ్స్ అందేలా చూడాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రుల పక్షాన తాము చేస్తున్న న్యాయమైన డిమాండ్లను ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో జిల్లా అధ్యక్షుడు వొడిసేల అర్జున్, జిల్లా ఉపాధ్యక్షుడు రావులవారు విఠల్, గిల్లీ విజయ్, జిల్లా కార్యదర్శి ఆకుల కార్తీక్, పట్టణ అధ్యక్షులు పొలాస భరత్ కుమార్, బీజేవైఎం నాయకులూ అర్పిత్ పటేల్, కార్తీక్ ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేవైఎం నాయకులు

ఆయిల్‌పాం సాగుపై శ్రద్ధ వహించాలి

- ఉద్యానవన శాఖ అధికారి హర్షవర్ధన్‌రెడ్డి

లోకేశ్వరం:రైతులు ఆయిల్‌పాం సాగుపై శ్రద్ధ వహించాలని ఉద్యానవన శాఖ అధికారి హర్షవర్ధన్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆయిల్‌పాం సాగుపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. మండలంలో ఇప్పటి వరకు 220 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగుచేస్తున్నట్లు పేర్కొన్నారు. 2023–24 ఏడాదికిగాను ఆసక్తిగల రైతులు 600 ఎకరాలు సాగు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఇప్పటి నుంచే ఆయిల్‌పాం సాగుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయిల్‌పాం సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీ కల్పిస్తుందని తెలిపారు. ఆయిల్‌పాం తోటలో మూడేళ్ల వరకు అంతర పంటగా మొక్కజొన్న, జొన్న, సోయా, కూరగాయలు సాగుచేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, భైంసా ఏరియా మేనేజర్ వెంకటేశ్వర్లు, క్లష్టర్ అధికారి శేఖర్, ఏఈవోలు మౌనిక, భూమేశ్, మౌనిక పాల్గొన్నారు.



ఆయిల్‌పాం సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారి

బాసరలో ఆక్రమణల తొలగింపు

భైంసాటౌన్: బాసర గోదావరి తీరంలోని శివాలయం సమీపంలో ఆక్రమణలను ఆలయ ఈవో, తహసీల్దార్, ఎస్సై సమక్షంలో మంగళవారం తొలగించారు. సర్వే నంబర్ 438లో దేవస్థానానికి చెందిన భూమిలో కొన్ని దుకాణాలు వెలిసిన నేపథ్యంలో వాటిని తొలగింపజేశారు. భూమికి హద్దులు, ఫెన్సింగ్, ప్రహరీ నిర్మాణం సందర్భాల్లో పలుమార్లు దుకాణాలు తొలగించాలని సూచించినా ఖాళీ చేయలేదు. దీంతో బలవంతంగా వాటిని తొలగించామని ఈవో విజయరామారావు తెలిపారు. మరికొందరికి గడువు ఇచ్చినట్లు పేర్కొన్నారు. స్వచ్ఛందంగా తొలగించకుంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు.



దుకాణాలు తొలగిస్తున్న అధికారులు

సామర్థ్యాల పెంపునకు 'లిప్'

- 'తొలిమెట్టు' తరహాలో నిర్వహణ
- ఆరు నుంచి తొమ్మిది తరగతుల విద్యార్థుల కోసం
- అభ్యసన సామర్థ్యాల పెంపే లక్ష్యం
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు

నిర్మల్ రూరల్: ఉన్నత పాఠశాల విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు ప్రభుత్వం కొత్త కార్యక్రమాన్ని అమలు చేయబోతోంది. కరోనా అనంతరం విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు బాగా తగ్గాయి. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు తొలిమెట్టు కార్యక్రమం విజయవంతం కావడంతో విద్యాశాఖ మరిన్ని తరగతులకు ఈ విధానాన్ని విస్తృత పరిచే ఏర్పాట్లు చేస్తోంది. వచ్చే విద్యా సంవత్సరం 6 నుంచి 9వ తరగతుల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు లిప్ (లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం) కార్యక్రమాన్ని అమలు చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది.

సామర్థ్యాలు తగ్గిన నేపథ్యంలో..

6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో నిర్దేశిత సామర్థ్యాలు కనిపించడం లేదు. చదువుతోపాటు ఇతర కార్యక్రమాల్లో విద్యార్థులు మరింత వెనుకబడే ప్రమాదం ఉందని నిపుణులు గుర్తించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే చాలామంది విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు లేవని నిర్ధారించారు. ఈ క్రమంలో విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే శ్రవణం, పఠనం సామర్థ్యాలను పెంపొందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేకమైన కార్యక్రమం నిర్వహించి తరగతుల వారీగా నిర్దేశించిన సామర్థ్యాలను సాధించాలని విద్యాశాఖ నిర్ణయించింది.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి..

జిల్లాలో 117 ఉన్నత, 85 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 40 వేల మందికిపైగా విద్యార్థులు 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుకుంటున్నారు. ఈ విద్యార్థులు 2020–21 విద్యా సంవత్సరం నుంచి రెండేళ్లపాటు కరోనా కారణంగా ప్రత్యక్ష తరగతులకు హాజరు కాలేదు. డిజిటల్ పాఠాలు మాత్రమే విన్నారు. ఇలాంటి వారిలో విద్యా సామర్థ్యాల పురోగతి అంతంతమాత్రంగానే ఉంది. కనీసం తెలుగు, ఇంగ్లిష్ చదవలేని విద్యార్థులు ఉన్నారని విద్యాశాఖ అధికారులు గుర్తించారు. వారి కోసమే ప్రత్యేకంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి 'లిప్' కార్యక్రమం ప్రారంభించాలని నిర్ణయించింది. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే చదివించడం, పాఠం వినేలా చేయడం, సాధనలో పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందనలు, స్లిప్ టెస్టుల నిర్వహణ, ఇంటి పని అంతర్భాగం చేసేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించనున్నారు. ప్రతీ జిల్లా నుంచి సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడికి ఈనెల 2న హైదరాబాదులో ప్రత్యేక వర్క్‌షాప్‌లో శిక్షణ ఇచ్చారు.

'తొలి మెట్టు' సక్సెస్‌తో ముందుకు..

ప్రాథమిక విద్యార్థుల కోసం విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు గత విద్యా సంవత్సరం ఆగస్టు 15 నుంచి జిల్లాలో తొలిమెట్టు కార్యక్రమాన్ని ప్రాథమిక పాఠశాలలో అమలు చేశారు. మూడేళ్లపాటు అమలు చేసే ఈ కార్యక్రమంలో మొదటి ఏడాది తెలుగు, ఇంగ్లిష్, గణితంపై ప్రత్యేకంగా రూపొందించిన మాడ్యూల్స్ ఆధారంగా విద్యార్థులకు బోధన నిర్వహించారు. ఈ విధానంతో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడినట్లు అధికారులు గుర్తించారు. విద్యార్థుల సామర్థ్యం పరీక్షించేందుకు స్కూల్ కాంప్లెక్స్, మండల, జిల్లాస్థాయిలో ప్రధానోపాధ్యాయులతో బృందాలు ఏర్పాటు చేసి ప్రత్యేకంగా పర్యవేక్షించారు. అప్పటి కలెక్టర్ ముషరఫ్ అలీ ఫారుఖీ డీఈవో రవీందర్‌రెడ్డి ఈ కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ వహించి జిల్లాలో పకడ్బందీగా అమలు చేశారు. ప్రతీనెల క్రమం తప్పకుండా ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు సైతం చేశారు. ఇదే తరహాలో 'లిప్'ను కూడా వచ్చే విద్యా సంవత్సరం నుంచి పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రాథమికోన్నత విద్యార్థుల కోసం...



తొలిమెట్టు తరహాలోనే వచ్చే విద్యా సంవత్సరం నుంచి జిల్లా వ్యాప్తంగా 'లిప్'ను అమలు చేస్తాం. ఉన్నత పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి వరకు గల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు ఈ కార్యక్రమం అమలు చేయనున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం కార్యచరణ చేపడతాం. ఇప్పటికే హైదరాబాదులో సీనియర్ ప్రధానోపాధ్యాయుడికి వర్క్‌షాప్ పూర్తయింది. – రవీందర్‌రెడ్డి, డీఈవో

కేసీఆర్ పాలనలో బీసీలకు అన్యాయం

ఖానాపూర్: కేసీఆర్ పాలనలో బీసీలు అణచివేతకు గురవుతున్నారని, అన్నిరంగాల్లో వెనుకబడుతున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి స్వామియాదవ్ ఆరోపించారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. ఈనెల 18న హైదరాబాద్‌లో జరిగే బీజేపీ ఓబీసీ మోర్చా సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని కోరారు. జిల్లా నుంచి 500 మందికి పైగా ప్రతినిధులు హాజరుకావాలన్నారు. బీజేపీతోనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో నాయకులు నర్సాగౌడ్, గోస్కుల మల్లేశ్, అఖిల్ రెడ్డి, గుడాల రాజన్న, పెట్టెం చంద్రశేఖర్, కాలేరు రాజేందర్, పవన్, మల్లేశ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న స్వామియాదవ్

క్లుప్తంగా

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య


సాయన్న (ఫైల్‌)

లక్ష్మణచాంద: అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వడ్యాల్‌ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై రాహుల్‌ గైక్వాడ్‌ కథనం ప్రకారం.. వడ్యాల్‌ గ్రామానికి చెందిన రావులబండి సాయన్న(54), లక్ష్మి భార్యభర్తలు. ఇద్దరు కుమారులు గణేశ్‌(18), మహేశ్‌ (14) ఉన్నారు. సాయన్న వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. భార్య లక్ష్మి కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతుండేది. ఆ సమయంలో లక్ష్మి వైద్య చికిత్స నిమిత్తం సాయన్న అప్పులు చేశారు. ఐదేళ్ల క్రితం లక్ష్మి చనిపోయింది. చేసిన అప్పులు తీర్చలేక తీవ్ర మనస్తాపంతో సాయన్న సోమవారం ఇంట్లోనే గుర్తు తెలియని పురుగుల మందు తాగి పడిపోయాడు. అటువైపు వెళ్లిన వారు గమనించి నిర్మల్‌ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మంగళవారం వేకువజామున మృతిచెందాడు. మృతుడి తల్లి చిన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో యువకుడు...

కుభీర్‌: జీవితంపై విరక్తితో యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఎండీ.షరీఫ్‌ కథనం ప్రకారం.. మండలంలోని దార్‌కుభీర్‌ గ్రామానికి చెందిన బన్సోడే శ్రీకాంత్‌ (25) ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం మద్యం మత్తులో గేదెలు మేపడానికి వెళ్తానని చెప్పి తన పశువుల పాకకు వెళ్లి తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీకాంత్‌ చిన్నాన్న గంగాధర్‌.. పనిమీద పాకకు వెళ్లి చూసి కుటుంబీకులకు సమాచారం ఇచ్చాడు. మృతుడి తండ్రి ఈర్వా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

25 మందికి జరిమానా

నిర్మల్‌టౌన్‌: మద్యం తాగి వాహనాలు నడిపిన 25 మందికి జరిమానా, ఒకరికి మూడు రోజుల జైలుశిక్ష విధిస్తూ నిర్మల్‌ కోర్టు స్పెషల్‌ జ్యూడిషయల్‌ జడ్జి తీర్పునిచ్చారని పట్టణ ట్రాఫిక్‌ ఎస్సైలు రాజశేఖర్‌, దేవేందర్‌ తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ పలువురు పట్టుబడగా వారిని కోర్టులో హాజరుపర్చారు. 25 మందికి రూ.22,800 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారు.

బైక్‌ ఢీకొని ఒకరి మృతి


సంతోష్‌ (ఫైల్‌)

బోథ్‌: మండలంలోని సొనాల గ్రామ సమీపంలో బైక్‌ ఢీకొని ఒకరు మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సొనాలకు చెందిన బాలె సంతోష్‌ ఫర్టిలైజర్‌ షాపు నిర్వహిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం ఘన్‌పూర్‌ వైపు వాకింగ్‌ చేస్తున్న సంతోష్‌ను సొనాల శివారులో మహారాష్ట్ర వైపు వెళ్తున్న బైక్‌ వెనుక నుంచి ఢీకొంది. దీంతో తీవ్ర రక్తస్రావమై సంతోష్‌ అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్‌పై ఉన్న ఇద్దరిలో ఒకరు తీవ్ర గాయాలపాలై బోథ్‌ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మరొకరు పారిపోయినట్లు ఎస్సై రవీందర్‌ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

నకిలీ విత్తనాలపై నిఘా

ఆదిలాబాద్‌టౌన్‌: వానాకాలం సీజన్‌ సమీపిస్తుండడంతో వ్యవసాయశాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కొరడా ఝులిపించేందుకు నిఘా సారించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, మండల స్థాయి టాస్క్‌ఫోర్స్‌ కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్‌ చైర్మన్‌గా, జిల్లా వ్యవసాయ అధికారి కన్వీనర్‌గా, డీఎస్పీ, ఏడీఏలు సభ్యులుగా ఉంటారు. మండల స్థాయిలో మండల వ్యవసాయ అధికారి, తహసీల్దార్‌, ఎస్సైలు టాస్క్‌ఫోర్స్‌ కమిటీలో సభ్యులుగా ఉంటారు. బుధవారం నుంచి జిల్లాలో టాస్క్‌ఫోర్స్‌ కమిటీలు తనిఖీలు చేపట్టనున్నారు. మంగళవారం కమిటీలను నియమిస్తూ జిల్లా కలెక్టర్‌ ఉత్తర్వులు జారీచేశారు.

- జిల్లా, మండల స్థాయి టాస్క్‌ఫోర్స్‌ కమిటీల ఏర్పాటు
- నేటి నుంచి తనిఖీలు
- నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట పడేలా..


విత్తన దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్‌)

నేటి నుంచి తనిఖీలు

నకిలీ విత్తనాలపై నిఘా పెట్టేందుకు టాస్క్‌ఫోర్స్‌ కమిటీ బుధవారం నుంచి జిల్లాలోని అన్ని మండలాల్లో తనిఖీలు చేపట్టనుంది. విత్తనాలు, ఎరువుల గోదాములు, దుకాణాలు, అనుమానం ఉన్న షాపుల్లో తనిఖీలు చేయనున్నారు. అదేవిధంగా గ్రామాల్లో కూడా అధికారులు తనిఖీలు చేపట్టి రైతులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జిల్లాలో దాదాపు 500 విత్తన, ఎరువుల దుకాణాలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా లైసెన్సులు లేకుండా విక్రయిస్తున్న వారిపై క్రిమినల్‌ కేసులు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. లైసెన్సులు ఉన్న దుకాణదారులు నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిపితే వారిపై కూడా చర్యలు చేపట్టనున్నారు. జిల్లాకు 8 లక్షల 50 వేల పత్తి ప్యాకెట్లు, 40 వేల క్వింటాళ్ల సోయా విత్తనాలు అవసరం ఉన్నాయి. అయితే రైతుల అవసరాలను ఆసరాగా చేసుకొని కొంతమంది డీలర్లు రైతులను ప్రతిఏటా మోసం చేస్తూనే ఉన్నారు.

అడ్డుకట్ట పడేనా..

కొంతమంది డీలర్లు గ్రామాల్లో తిరుగుతూ రైతుల వద్ద ముందుగానే పత్తి విత్తనాలు బుకింగ్‌ చేసుకుంటున్నారు. లక్కీ కూపన్ల పేరిట వారిని మోసం చేస్తున్నారు. ప్రతిఏడాది ఈ వ్యాపారం చాపకింద నీరులా విస్తరిస్తున్నప్పటికీ వ్యవసాయ శాఖ అధికారులు అరికట్టడంలో విఫలమవుతున్నారు. గతేడాది తలమడుగు, జైనథ్‌, తాంసి తదితర మండలాల రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేసిన విత్తనాలు మొలకెత్తకపోవడంతో డీలర్‌ షాపుల ఎదుట ఆందోళన చేపట్టారు. అయినప్పటికీ ఆ డీలర్లపై చర్యలు చేపట్టలేకపోయారు. గత కొన్నేళ్లుగా ఇదే తంతు జరుగుతున్నప్పటికీ ఈ నకిలీ విత్తనాల మోసగాళ్ల ఆటకట్టడంలో వ్యవసాయ అధికారులు సఫలీకృతం కావడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. టాస్క్‌ఫోర్స్‌ కమిటీలు ప్రతిఏటా ఏర్పాటు చేస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో నకిలీ విత్తనాలను గుర్తించడం లేదనే అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. ఆంధ్ర, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన కొంతమంది డీలర్లు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ముందుగానే బుకింగ్‌ చేసుకొని రైతులకు నాసిరకమైన విత్తనాలు అంటగడుతున్నారు. మోసపోయాక రైతులు లబోదిబోమంటున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్‌ కేసులు



నకిలీ విత్తనాలను అరికట్టేందుకు టాస్క్‌ఫోర్స్‌ కమిటీని ఏర్పాటు చేశాం. జిల్లా స్థాయి కమిటీలో డీఎస్పీ, ఏడీఏలు, మండల స్థాయి కమిటీలో మండల వ్యవసాయ అధికారి, తహసీల్దార్‌, ఎస్సైలు సభ్యులుగా ఉన్నారు. బుధవారం నుంచి జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపడుతాం. రైతులు డీలర్ల వద్దనే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలి. రసీదు తప్పనిసరిగా తీసుకోవాలి. నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్‌ కేసులు నమోదు చేస్తాం.

– పుల్లయ్య, జిల్లా వ్యవసాయ అధికారి, ఆదిలాబాద్‌

పెళ్లి వేడుకలో తప్పిన ప్రమాదం


దగ్ధమైన బైక్‌, టెంట్‌

భైంసాటౌన్‌: బాసర మండలకేంద్రంలో మంగళవారం ఓ వివాహ వేడుకలో హఠాత్తుగా స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక సరస్వతి కల్యాణ మండపంలో జరిగిన పెళ్లి వేడుకలో ఈ ప్రమాదం జరుగగా, ఎవరికి ఎలాంటి హాని కలుగలేదు. వివరాల్లోకి వెళ్తే.. కల్యాణ మండపంలో వివాహ అనంతరం వేడుకల్లో భాగంగా టపాకాయలు కాల్చడంతో నిప్పురవ్వలు ఎగిరి టెంట్‌పై పడడంతో మంటలు చెలరేగాయి. దీంతో టెంట్‌ కింద ఉన్న నాలుగు బైక్‌లు, కుర్చీలు దగ్ధమయ్యాయి. అక్కడున్నవారు మంటలార్పడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్‌: తలమడుగు మండలం ఉండంకు చెందిన రేంజర్ల సంటెన్న (60) హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈనెల 13న సాయంత్రం 4 గంటల సమయంలో ఆదిలాబాద్‌లోని గాంధీనగర్‌ నుంచి ఇందిరానగర్‌ వైపు వెళ్తున్న క్రమంలో ఎద్దు పొడవడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి మరుసటి రోజు హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో ఆయన మనుమడు రేంజర్ల మురళి ఫిర్యాదు మేరకు టూటౌన్‌ ఎస్సై విష్ణుప్రకాశ్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

అక్రమంగా తరలిస్తున్న ఆవుల పట్టివేత


వాహనంలో ఆవులు

ఖానాపూర్‌: మండలంలోని పాత ఎల్లాపూర్‌ గ్రామం మీదుగా కడెం వైపు బొలెరోలో అక్రమంగా ఆవులను తరలిస్తున్న వాహనాన్ని మంగళవారం ఉదయం పట్టుకున్నట్లు ఎస్సై ఆర్‌.శంకర్‌ తెలిపారు. అనుమానాస్పదంగా వెళ్తున్న వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో 9 ఆవులతో పాటు ఒక లేగదూడ ఉందని పేర్కొన్నారు. ఆవులకు సంబంధించి ఎలాంటి రసీదు, అనుమతిపత్రం లేదని, ఓవర్‌లోడ్‌ ఉండడం వల్ల డ్రైవర్‌ ఇమ్రాన్‌, యజమాని బారిక్‌ రుషిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు. పట్టుకున్న ఆవులను గోశాలకు తరలించినట్లు పేర్కొన్నారు.

దొంగతనం కేసులో ఇద్దరికి జైలు

నిర్మల్‌టౌన్‌: దొంగతనం కేసులో ఇద్దరికి మూడు నెలల జైలుశిక్ష విధిస్తూ నిర్మల్‌ ప్రథమ న్యాయమూర్తి ఆర్‌.అజయ్‌కుమార్‌ మంగళవారం తీర్పునిచ్చారు. కోర్టు సమన్వయల అధికారి సక్రియనాయక్‌ తెలిపిన వివరాలు.. జిల్లాకేంద్రానికి చెందిన గన్నేరు ప్రభు ఇత్తడి వ్యాపారం చేసుకునేవాడు. వ్యాపార రీత్యా ఇత్తడి పాత సామన్లు 200 కేజీల వస్తువులను తన పాత ఇంట్లో భద్రపర్చాడు. 2022 నవంబర్‌ 10న రాత్రి సమయంలో నేరస్తులైన మోతే సాయి, గోగ్గుల గంగనగేశ్‌, పిట్ల అంజి కలిసి ప్రభు ఇంట్లో చొరబడి రూ.50 వేల విలువైన 200 కిలోల ఇత్తడి సామాన్లను ఎత్తుకెళ్లారు. బాధితుడు ఫిర్యాదు తో ఎస్సై రమణారెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. చార్జీషీట్‌ దాఖలు చేసి కోర్టులో నిందితులను హాజరుపర్చారు. పీపీ సీహెచ్‌ సతీశ్‌ 6 మంది సాక్షులను ప్రవేశపెట్టి కోర్టులో నేరం రుజువు చేయడంతో న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కాగా, మూడో నేరస్తుడైన పిట్ల అంజి చనిపోయాడు.

మొక్కజొన్న దగ్ధం


కాలిన మొక్కజొన్నను చూపిస్తున్న బాధిత రైతు

కుంటాల: మండలంలోని అంబకంటి శివారులో మంగళవారం అగ్ని ప్రమాదంలో మొక్కజొన్న పంట దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు శీల సునీల్‌ యాసంగి సీజన్‌లో తనకున్న రెండెకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. హార్వెస్టర్‌తో పంట నూర్పిడి చేసేందుకు కుప్పలు కుప్పలుగా పోసి ఉంచాడు. కాగా పంట చేను పైన ఉన్న విద్యుత్‌ వైర్లు గాలికి ఒకదానికొకటి తగలి నిప్పురవ్వలు ఎగిసిపడడంతో మొక్కజొన్న పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.లక్షా 70వేల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు.

ఇండో–నేపాల్‌ క్రికెట్‌ చాంపియన్‌ షిప్‌నకు దీపురెడ్డి


దీపురెడ్డి

లోకేశ్వరం: మండల కేంద్రానికి చెందిన కొమ్ముల దీపురెడ్డి ఇండో–నేపాల్‌ క్రికెట్‌ చాంపియన్‌ షిప్‌నకు ఎంపికయ్యాడు. గతేడాది అక్టోబర్‌లో నిజామాబాద్‌ జిల్లా ఆర్మూర్‌లో జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్‌ క్రికెట్‌ టోర్నమెంట్‌ నిర్వహించారు. ఇందులో అండర్‌–14లో తెలంగాణ టీం నుంచి దీపురెడ్డి ప్రతిభ కనబర్చాడు. నేపాల్‌ దేశంలో పోక్రాలో ఈనెల 14 నుంచి 18 వరకు నిర్వహించే క్రికెట్‌ ఇండో–నేపాల్‌ చాంపియన్‌ షిప్‌–2023కు దీపురెడ్డిని ఎంపిక చేశారు. దీంతో తల్లిదండ్రులు కొమ్ముల కల్యాణ్‌రెడ్డి–శారద, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్‌: పట్టణంలోని రవీంద్రనగర్‌లో గల ఉమామహేశ్వర్‌, అయ్యప్ప ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. దీంతో ఆలయ నిర్వాహకుడు కోల వేణుగోపాల్‌రెడ్డి వన్‌టౌన్‌ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై అశోక్‌, హెడ్‌ కానిస్టేబుల్‌ రాములు మంగళవారం దొంగను పట్టుకున్నారు. ఈయన ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం అనంతపురం జిల్లాకు చెందిన గండికోట దుర్గాప్రసాద్‌ గతకొన్ని రోజులుగా ఆదిలాబాద్‌లోని వడ్డెర కాలనీలో నివాసం ఉంటున్నాడు. తరచూ ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడుతూ తప్పించుకొని తిరుగుతున్నాడు. ఈయనపై పలు పోలీసుస్టేషన్‌లో 14 కేసులు నమోదయ్యాయి. నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

అదుపుతప్పిన బైక్‌

- ముగ్గురికి తీవ్రగాయాలు

తాంసి: మండల కేంద్రంలోని సుంకిడి గ్రామ సమీపంలో బైక్‌ అదుపుతప్పిన ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. తాంసి గ్రామానికి చెందిన కోట్రంగి పాండ్‌, సంతోష్‌ మద్యం మత్తులో సోమవారం రాత్రి సుంకిడి నుంచి తాంసి గ్రామం వైపు బైక్‌పై వస్తున్నారు. ఈ క్రమంలో గ్రామ సమీపంలో రాగానే బైక్‌ ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న కాడిగిరి సంతోష్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న సంతోష్‌, పాండ్‌లకు తీవ్ర గాయాలు కాగా, రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న సంతోష్‌ కాలుపై బైక్‌ వెళ్లడంతో కాలు విరిగింది. గాయపడిన వారిని గ్రామస్తులు అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ


తీవ్రంగా గాయపడిన నర్సయ్య

సిరికొండ: మండలంలోని సుంకిడి గ్రామంలో మంగళవారం సాయంత్రం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. సిరికొండలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో పని ముగించుకొని మేనేజర్‌ నరేశ్‌, సిబ్బంది నర్సయ్య ఇచ్చోడకు బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో ఇచ్చోడ నుంచి సిరికొండకు గోర్ల శంకర్‌ బైక్‌పై వస్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈప్రమాదంలో నరేశ్‌, నర్సయ్య, గోర్ల శంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

నిర్మల్‌లో జీరోషాడో


వస్తువు నీడను కోల్పోయిన దృశ్యాన్ని వీక్షిస్తున్న చిన్నారులు

- నిమిషం 40 సెకన్లు కనిపించని నీడ
- వస్తువుతో పరీక్షించిన చిన్నారులు

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్‌లో మంగళవారం ఓ అద్భుతం ఆవిష్కృతమైంది. నిమిషం 40 సెకన్ల పాటు నీడ మాయమైంది. మధ్యాహ్నం 12.12 నుంచి 12.13 నిమిషాల 40 సెకన్ల పాటు మనుషులు, వస్తువుల నీడ కనిపించలేదు. ఒక వస్తువుపై సూర్యకిరణాలు పడితే మరోవైపున వ్యతిరేక దిశలో ఆ వస్తువు నీడ ఏర్పడటం సర్వసాధారణమే. దీనికి భిన్నంగా ఉష్ణమండలంలోని కర్కాటక రేఖ, మకరరేఖ 23.4 డిగ్రీల మధ్యన నీడలేని రోజు (జీరో షాడో డే) సంవత్సరానికి రెండుసార్లు ఏర్పడుతుంది. ఈ ఏడాది నిర్మల్‌ జిల్లాకేంద్రంలో ।నీడలేని రోజు॥ మే 16న కనిపించింది. ఇదే ఘటన తిరిగి జూలై 27న మరోసారి పునరావృతం కానుంది. నిర్మల్‌లో నీడ మాయం కావడంతో పలువురు చిన్నారులు పొడువాటి వస్తువుతో పరీక్షించారు.

భూమి అక్షం సూర్యునితో గల కోణంలో వంపు కారణంగా నీడ సంభవిస్తుంది. ఏడాది పొడవునా సూర్యకిరణాలు ప్రసారమయ్యే కోణాన్ని బట్టి వాటి నీడల పొడవు, దిశ మారుతుంటుంది. భూభ్రమణం అక్షం సమతలానికి 23.45 డిగ్రీల కోణంలో వంగి ఉంటుంది. భూమి సూర్యుని మధ్యరేఖను సౌరక్షీణత అని పిలుస్తారు. ఈ సౌరక్షీణత సూర్యకిరణాలు పడే అక్షాంశానికి సమానమైనప్పుడు 'జీరో షాడో డే' ఏర్పడుతుందని జిల్లాకేంద్రానికి చెందిన భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు పురస్తు శ్రీనివాస్‌ 'సాక్షి'తో పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ఏడాదిలో రెండుసార్లు కనిపిస్తుందన్నారు.

డిగ్రీ కళాశాలకు రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతి


అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్‌, విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్‌: ఆదిలాబాద్‌ ప్రభుత్వ సైన్స్‌ డిగ్రీ కళాశాలకు జిజ్ఞాస పోటీల్లో రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతి లభించింది. కళాశాల విద్యార్థులు రూపొందించిన బుర్నూర్‌ గ్రామ సమగ్ర చరిత్రకుగాను ఈ అవార్డు దక్కింది. మంగళవారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఆడిటోరియంలో ఉన్నత విద్యామండలి చైర్మన్‌ లింబాద్రి చేతుల మీదుగా విద్యార్థులు అవార్డును అందుకున్నారు. రూ.21వేల నగదుతోపాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ప్రిన్సిపాల్‌ జగ్‌రాం, జిజ్ఞాస సమన్వయకర్త రమేశ్‌, గైడ్‌ టీచర్‌ సంతోష్‌కుమార్‌ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


అత్రం రంబాబాయి(ఫైల్‌)

ఇంద్రవెల్లి: మహిళ అదృశ్యమైన ఘటన మండలంలోని గట్టెపల్లి పంచాయతీ పరిధిలోని చిత్తగూడలో చోటుచేసుకుంది. ఎస్సై సునీల్‌ కథనం ప్రకారం.. చిత్తగూడకు చెందిన ఆత్రం రంబాబాయి (27) ఈనెల 5న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదు. రంబాబాయి అన్న ఆత్రం జంగు మంగళవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్‌/ఉట్నూర్‌రూరల్‌: అట్రాసిటీ కేసుల్లో బాధితులకు ప్రభుత్వం తరపున ఆర్థికంగా, పునరావాసం కల్పించేందుకు డివిజనల్‌ విజిలెన్స్‌, మానిటరింగ్‌ కమిటీ సభ్యుల ఎంపికకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏఎస్‌వో నారాయణ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డ్‌ కులాలు, తెగలకు చెందిన కార్యకర్తలు, సంఘాల, స్వచ్ఛంద సంస్థల సభ్యులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆదిలాబాద్‌, ఉట్నూర్‌ డివిజనల్‌ కమిటీలకు సంబంధించి ఆదిలాబాద్‌, ఉట్నూర్‌ ఏఎస్‌డబ్ల్యూవో కార్యాలయాల్లో ఈనెల 22లోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. కుల, నివాస ధ్రువీకరణ పత్రాలతోపాటు ఆధార్‌, రెండు పాస్‌ఫొటోలు, సామాజిక కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు పొందుపర్చి దరఖాస్తుకు జత చేయాలన్నారు.

'ఉపాధి'లో అక్రమాలు

- గల్ఫ్‌ దేశాల్లో ఉన్నవారు పని చేసినట్లు నిధులు స్వాహా
- హరితహారం, ప్రకృతివనాల్లో వేల సంఖ్యలో ఎండిన మొక్కలు


పాల్గొన్న డీఆర్‌డీవో విజయలక్ష్మి, అధికారులు

సారంగపూర్‌: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో పలు అక్రమాలు వెలుగు చూశాయి. చాలావరకు హాజరు నమోదు, తమ బంధువుల పేర్లమీద గల్ఫ్‌ దేశాలకు వలస వెళిన వారి పేరుమీద పనిచేసినట్లుగా మస్టర్లపై స్వదేశంలో లేనివారి సంతకాలు చేసి ఖాతాల్లో డబ్బులు జమచేసుకున్నవారి వివరాలు బట్టబయలయ్యాయి. మండలంలోని ఆడెల్లికి చెందిన యాటకారి పీరాజీ దుబాయికి ఉపాధి నిమిత్తం వెళ్లాడు. తన పేరు మీద పనిచేసినట్లు అక్రమ మస్టర్లు సృష్టించి రెండువారాల పాటు పనిచేశారని రూ.1167ల నిధులను పక్కదారి పట్టించారు. వివిధ గ్రామాల్లో ఇదే తరహాలో దాదాపు రూ. 55వేల నిధులు అక్రమాలు జరిగినట్లు బృందాలు వెల్లడించాయి. బీరవెల్లికి చెందిన ఉపాధి పనుల రిజిష్టర్లు అప్పగించలేదని తనిఖీ బృందాలు సభలో ప్రస్తావించారు. అడవిలో గుడిసెకు నిప్పంటుకోవడంతో రిజిష్టర్లు కాలాయన్నారు. వారి తరపున పలువురు మాట్లాడుతూ వర్షానికి తడిసిపోయాయని సమాధానమివ్వడం అనుమానాలకు తావిస్తోంది. మండల వ్యాప్తంగా 2019 డిసెంబర్‌ 1నుంచి 31మార్చి 2023 వరకు రూ.35 కోట్ల 30 లక్షల నిధులతో 32 పంచాయతీల్లో పనులు చేపట్టారు. హరితహారంలో భాగంగా గ్రామాల్లో పల్లె ప్రకృతివనాలు, గ్రీన్‌జోన్‌లు, శ్మశానవాటికలు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటారు. లక్షల్లో నాటిన మొక్కలు వేలలో మాత్రమే వృద్ధిచెందగా ఇదేంటని పలుమార్లు డీఆర్‌డీవో విజయలక్ష్మి గ్రామాల ఎఫ్‌ఏలు, కార్యదర్శులు, టీఏలను ప్రశ్నించారు. ఇక పెంపకందారులకు గొర్రెలు, ఆవులు, మేకలకు మంజూరైన షెడ్లను అధికారులు, నాయకుల అండదండలతో రాయితీ నిధులతో నివాస గృహాలుగా మార్చుకున్నారని తనిఖీల్లో వెల్లడయ్యాయి. కంపోస్టు పిట్లు, ఇంకుడు గుంతల నిర్మాణాలు, బినామీ పేర్లతో బిల్లులు, ఇలా అనేక అక్రమాలు వెలుగు చూశాయి. ఏపీవో లక్ష్మారెడ్డి, ఎస్‌ఆర్‌పీ రాఘవులు, ఎస్‌టీఎం దత్తు, డీఆర్‌పీ కవిత పాల్గొన్నారు.

వానరం దాహం తీర్చిన పోలీస్‌



నిర్మల్‌టౌన్‌: జిల్లాకేంద్రంలోని రాష్ట్రమంత్రి ఇంద్రకరణ్‌ రెడ్డి నివాసం వద్ద ఎండకు నీటి కోసం అలమటిస్తున్న వానరం దాహాన్ని పోలీసు తీర్చాడు. మంత్రి నివాసం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్‌ మహమ్మద్‌ అష్ఫద్‌.. మంగళవారం వానరాన్ని చేతిలో తీసుకుని నీటిని అందించి మానవత్వం చాటాడు. శెభాష్‌ పోలీసు అంటూ ప్రజలు అభినందించారు.